# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-ఆర్‌బీఐ 90 సంవత్సరాల వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పాల్గొని ప్రసంగించారు.**
2. **రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉండగా.. తలసరి ఆదాయం పెరుగుదలలో మూడో స్థానంలో ఉందని ఎస్బీఐ పరిశోధన నివేదిక వెల్లడించింది.**
3. **వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ఈరోజు సత్యసాయి జిల్లాలోని ధర్మవరం, కదిరి నియోజకవర్గంలో కొనసాగుతోంది.**
4. **రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నామని సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది.**
5. **రాష్ట్రంలో ఈరోజు నుంచి ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

=========================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ వృత్తి నైపుణ్యానికి, నిబద్ధతకు మారు పేరుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు ముంబైలో జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-ఆర్‌బీఐ 90 సంవత్సరాల వేడుకల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. భారత బ్యాంకింగ్ రంగం అభివృద్ధి ఒక పరిశీలనాత్మక అంశంగా మారిందని అన్నారు. దేశ జీడీపీ ద్రవ్య, ఆర్థిక విధానాల మధ్య సమన్వయంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ద్రవ్య కఠినత ఉన్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ రాబడులను స్థిరీకరించగలిగిందని, ద్రవ్యోల్బణ అంచనాలను ప్రోత్సహించడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయం సాధించిందని పేర్కొంటూ..

వాయిస్ (30 సెకన్లు)

-------------------------

రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాలుగో స్థానంలో ఉండగా.. తలసరి ఆదాయం పెరుగుదలలో మూడో స్థానంలో ఉందని బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధన నివేదిక వెల్లడించింది. వివిధ రాష్ట్రాల్లో 2012 నుంచి 2022 వరకు దశాబ్ద కాలంలో జీఎస్‌డీపీ, తలసరి ఆదాయాల పెరుగు దలపై ఎస్బీఐ పరిశోధన నివేదికను నిన్న విడుదల చేసింది. కోవిడ్ అనంతరం 2022-23లో దేశ జీడీపీ 8.1 శాతం

ఉండగా అందులో ఆంధ్రప్రదేశ్ కంట్రి బ్యూషన్ 0.4 శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. నికర స్థూల ఉత్పత్తిలో 2012-2022 మధ్య గుజరాత్ స్థూల ఉత్పత్తిలో తలసరి ఆదాయం పెరుగుదలలో తొలిస్థానంలో ఉండగా.. కర్ణాటక -2, ఆంధ్రప్రదేశ్ మూడు, తెలంగాణ నాలుగు, అస్సోం ఐదో స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో గుజరాత్ మొదటి స్థానం, కర్ణాటక రెండు, అసోం మూడు, ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని.. ఆ తరువాత తెలంగాణ, సిక్కిం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలున్నాయని ఎస్బీఐ పరిశోధన నివేదిక వివరించింది.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర ఈరోజు సత్యసాయి జిల్లాలోని ధర్మవరం, కదిరి నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఉదయం 9 గంటలకు ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం సంజీవపురం నుండి బస్సు యాత్ర ప్రారంభం కాగా, సాయంకాలం కదిరి నియోజకవర్గానికి చేరుకోనుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం కదిరిలో ముస్లిమ్ లతో కలిసి జగన్మోహన్ రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొంటారని అనంతరం బస్సు యాత్ర తనకల్లు మండలం చీకటిమానిపల్లి వరకు కొనసాగుతుందని తెలిపాయి.

---------------------------

బాపట్ల జిల్లాలో శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు . బాపట్లలో పర్యటించిన ఆయన అక్కడ నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోస్తా తీర ప్రాంతంలో రెండు లక్షల హెక్టార్లలో ఆక్వా సాగు జరుగుంతుందని బాపట్లలోను ఆక్వా సాగు కు చర్యలు తీసుకుంటామని అన్నారు. బాపట్ల జిల్లాను ఆక్వా, ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సూర్యలంక బీచ్, తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసి బాపట్ల ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

---------------------------

పదోతరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఈ రోజు నుంచి నుంచి ఏప్రిల్ 8 వరకు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది 6.23 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, రాష్ట్రంలో 26 జిల్లాల్లోనూ మూల్యాంకనం కొనసాగుతుందని 25వేల మంది ఉపాధ్యాయులు 47 లక్షల 88 వేల 738 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు ఆయన తెలిపారు

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ కు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఉచిత పాలి సెట్ శిక్షణ అందిస్తున్నామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి. నాగరాణి తెలిపారు. ఈ రోజు నుండి ఏప్రిల్ 25 వరకు శిక్షణ కొనసాగుతుందని, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామని పదోతరగతి పరీక్షలు రాసినవారు ఈ శిక్షణకు హాజరుకావొచ్చని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ ఉంటుందని చివరిరోజున ప్రీఫైనల్ ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. పాలిసెట్ కు ఆన్లైన్లో దరఖాస్తులు ఈనెల 5 వరకు స్వీకరిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఈ రోజు నుంచి ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా రాయలసీమలో ఉష్ణోగ్రతల తీవ్రత అధికంగా ఉండనుందని, రానున్న నాలుగు రోజుల్లో వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. అలాగే, ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోనూ 40-44 డిగ్రీలకు చేరుకోవచ్చని వీటి ఫలితంగా ఆయా జిల్లాల్లో వడగాడ్పులు విస్తాయని, ఆ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పల్నాడు జిల్లాలో 40-42, ప్రకాశం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో 40-41 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీకాళహస్తి డిఎస్పీ ఉమా మహేశ్వరరావు సూచించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయ మాడవీధులలో ఓటర్లకు అవహగాన కల్పిస్తూ కేంద్ర సాయుధ బలగాలు ఈ ఉదయం భారీ కవాతు నిర్వహించాయి. ఈ సంధర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని..ఎన్నికల పోలింగ్ రోజు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రెండెంచెల భద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే శ్రీకాళహస్తి డివిజన్ పరిదిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ఇప్పటికే నిఘా ఉంచామని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు తప్పనిసరిగా ప్రభుత్వం మంజూరు చేసిన ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని చిత్తూరుజిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు.ఓటర్ ఎపిక్ కార్డులు లేని వారు ప్రత్యామ్నాయంగా ఫోటో గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేయవచ్చునన్నారు. ఆధార్ కార్డ్, జాబ్ కార్డ్, బ్యాంకు పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేయబడిన ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డ్స్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, భారతీయ పాస్ పోర్ట్, ఇలా 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

---------------------------

పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద ఈనెల 4వ తేదీన తిరుపతి తిరుమల దేవస్థానం-టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మెట్లోత్సవం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. భజన మండళ్ల కళాకారులు ఉదయం నుంచి అన్నమాచార్యుల వారి సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 5వ తేదీన తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో గోష్టిగానం, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామని...ఏప్రిల్ 6 నుండి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులు నిర్వహించనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

సార్వత్రికా ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె మాధవిలత పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరంలో ఓటర్ల అవగాహన కోసం ఈ ఉదయం నిర్వహించిన మోటర్ సైకిల్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ..

జిల్లాలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16 లక్షల 50 వేల మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో ఆయా ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మే 13వ తేదీన జరిగే పోలింగ్ అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు.

========================